teluguislam.net



# 28. లైలతుల్ ఖద్ర్ ఘనత

సకల చరాచర సృష్టికి ప్రభువు, పాలకుడు అయిన అల్లాహ్ సర్వమానవాళి మార్గదర్శకత్వం కోసం అవతరింపజేసిన అతి అమూల్యమైన, ప్రధానమైన అనుగ్రహం ఆయన గ్రంథం పవిత్ర ఖుర్ఆన్. మానవ జాతి సాఫల్యం, విజయం, రుజుమార్గం ఈ గ్రంథంలోనే నిబిడీకృతమై ఉన్నాయి. అలాంటి మహత్తర గ్రంథాన్ని పరమ పవిత్రుడైన అల్లాహ్ పవిత్ర రమజాన్ మాసంలో తన ప్రియ ప్రవక్త (స) పై ఓ ఘనమైన రేయిలో అవతరింపజేశాడు. ఆ ఘనమైన రాత్రినే 'లైలతుల్ ఖద్ర్' అంటారు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

إِنَّآ أَنزَلْنَٰهُ فِى لَيْلَةِ ٱلْقَدْرِ ① وَمَآ أَدْرَىٰكَ مَا لَيْلَةُ ٱلْقَدْرِ ② لَيْلَةُ ٱلْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ③ تَنَزَّلُ ٱلْمَلَٰٓئِكَةُ وَٱلرُّوحُ فِيهَا بِإِذْنِ رَبِّهِم مِّن كُلِّ أَمْرٍ ④ سَلَٰمٌ هِىَ حَتَّىٰ مَطْلَعِ ٱلْفَجْرِ ⑤

**"నిశ్చయంగా మేము దీనిని (ఖుర్ఆనును) ఘనమైన రాత్రియందు అవతరిం పజేశాము. ఆ ఘనమైన రాత్రి గురించి మీకేమి తెలుసు? ఘనమైన రాత్రి వెయ్యి నెలలకంటే కూడా శ్రేష్టమైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల ఆజ్ఞను తీసుకొని దిగి వస్తారు. ఆ రాత్రి ఆసాంతం తెల్లవారే వరకూ శాంతియుతంగా ఉంటుంది.** ***(అల్ ఖద్ర్ 97 : 1-5)***

లౌహె మహ్ఫూజ్ నుండి పవిత్ర ఖుర్ఆన్‌ను అల్లాహ్ ఆ ఘనరాత్రిలోనే విశ్వ ఆకాశం పై దింపాడు. అక్కడి నుండే ఆ అవతరణ 23 సంవత్సరాల వ్యవధిలో సందర్భానుసారంగా అవతరించి పూర్తిగావించబడింది.

'ఖద్ర్' అనే పదానికి మూడు అర్థాలున్నాయి. ఖద్ర్ అంటే విలువైనది, అమూల్యమైనది అని అర్థం. ఆ రాత్రికి అంతటి విలువ ఎలా వచ్చింది? పవిత్ర ఖుర్ఆన్ ఆ రేయిలోనే అవతరించబడింది. అందుకే ఆ రాత్రికి ఆ ఘనత. ఖద్ర్‌కు మరో అర్థం

శక్తి. అంటే ఆ రాత్రి ఎంతో శక్తిగలది. ఆ రాత్రి దైవధ్యానంలో ఆరాధనలో నిమగ్నమైన వారికి అమూల్యమైన విశ్వాసం, శక్తి ప్రాప్తమవుతుంది. అది దైవ ప్రసన్నతకు చేరువ చేస్తుంది.

ఇక మూడో అర్థం విధివ్రాత. అల్లాహ్ ఆ ఘనమైన రాత్రిలోనే ఆ సంవత్సరంలో జరగబోయే నిర్ణయాలను దైవదూతలకు అప్పజెప్పాడు. అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

إِنَّآ أَنزَلْنَٰهُ فِى لَيْلَةٍ مُّبَٰرَكَةٍ ۚ إِنَّا كُنَّا مُنذِرِينَ ③ فِيهَا يُفْرَقُ كُلُّ أَمْرٍ حَكِيمٍ ④

**"నిశ్చయంగా మేము దీనిని శుభప్రదమైన రాత్రియందు అవతరింప జేశాము. నిస్సందేహంగా మేము హెచ్చరిక చేసేవాళ్ళము. ఆ రాత్రియందే కీలకమైన ప్రతి ఉత్తర్వు జారీ చేయబడుతుంది.** ***(అద్దుఖాన్ 44 :3-4)***

ఖద్ర్ సూరాలో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు:

لَيْلَةُ الْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ③

**"ఆ ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే ఎంతో శ్రేష్టమైనది".**

***(అల్ ఖద్ర్ 97 : 3)***

అంటే ఆ ఒక్క రేయిలో అల్లాహ్ స్మరణ దైవ ప్రవక్త (స) సూచించిన విధంగా చేస్తే వెయ్యి రాత్రుల ఆరాధనల పుణ్యఫలం లభిస్తుంది. వెయ్యి నెలలు ఎనభైమూడు సంవత్సరాల నాలుగు నెలలకు సమానం. 83 సంవత్సరాలు క్రమంగా ఆరాధన చేసినంత గొప్పపుణ్యం ఒక్క రాత్రిలోనే ప్రాప్తమవుతుంది.

దైవప్రవక్త (స) ఒక యూదుని గురించి చెబుతూ ఇలా ప్రవచించారు:

**బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఓ వ్యక్తి ఎడతెగకుండా దైవధ్యానంలో 83 సంవత్స రాలు నిమగ్నమై ఉన్నాడు.** ***(సునన్ ఇబ్నె అబీహాతిమ్)***

"ఇస్రాయీల్ సంతతికి చెందిన ఓ వ్యక్తి రాత్రివేళ దైవధ్యానంలో గడుపుతూ పగలంతా అల్లాహ్ మార్గంలో శ్రమిస్తూ, పోరాడుతూ 83 సంవత్సరాలు గడిపాడు".

అల్లాహ్ ఎంతటి కరుణామయుడో పై హదీసు ద్వారా మనం గ్రహించగలం. 83 సంవత్సరాలు ఎడతెగకుండా చేసిన ఆరాధనా ఫలితం కేవలం కొన్ని గంటల్లో పొందే ఒక మహత్తర కారుణ్యాన్ని, అనుగ్రహాన్ని అల్లాహ్ ముస్లిం సమాజానికి

teluguislam.net



ప్రసాదించాడు. ఘనతగల ఆ రాత్రి అద్వితీయమైనది. కాబట్టి విశిష్ఠతగల ఆ రాత్రివేళ దానికి తగినట్లే ఆరాధన చేయాలి. ఇది కారుణ్య ప్రభువైన అల్లాహ్ తరుపున ఈ సమాజానికి (ఉమ్మత్) లభించిన ఓ మహదానుగ్రహం, ప్రత్యేక కారుణ్యం.

ఈ రేయికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఈ ఘనమైన రాత్రిలోనే దైవదూతల సర్దారు (రూహ్ ఆత్మ) జిబ్రీల్ (అలై) ఇతర దైవదూతలతో భువిపైకి దిగివచ్చి ఆ రాత్రి కూర్చుని లేదా నిలబడి దైవారాధనలో లీనమై ఉండేవారి మన్నింపుకోసం దైవాన్ని వేడుకుంటారు. ఆ ఘనమైన రాత్రి పూర్తిగా శాంతి శుభాలు కలిగి ఉండే రాత్రి. ఇలా అది తెల్లవారే (ఫజర్) వరకూ ఉంటుంది.

మరి ఈ ఘనమైన రాత్రి ఏ రోజు వస్తుంది? ఘనమైన రాత్రి రమజాను నెలలో ఏదో ఒక రాత్రి సంభవించవచ్చు. ఆ విషయం గురించి దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఘనమైన రాత్రి ని రమజాను చివరిరోజుల్లో వెదకండి".

(సహీహ్ బుఖారీ).

రమజాన్ నెల 27వ రాత్రి ఈ ఘనమైన రేయి వస్తుందని కొందరు భావిస్తారు. కాని దీన్ని ఖచ్చితమని ఎలా చెప్పగలం? దైవప్రవక్త (స) ప్రవచనం మేరకు చివరి పదిరాత్రులల్లోని బేసి రేత్రిల్లో వెదకడమే మనకు శుభదాయకం. అల్లాహ్ మనపై చూపిన ప్రత్యేక కటాక్షమిది.

మామూలు రాత్రిని వేయి నెలలకంటే గొప్ప రాత్రిగా, ఘనమైన రేయిగా మార్చివేసిన అద్భుత గ్రంథం ఖుర్ఆన్, ఈ గ్రంథం అరబ్బుల కోసమో దాన్ని విశ్వసించే ముస్లింల కోసమో రాలేదు. ఇది సకల మానవాళి మార్గదర్శకం కోసం సత్యసత్యాలను వేరుపరచి రుజుమార్గాన్ని చూపేగ్రంథం. కాబట్టి ఈ ఘనమైన రేయిన ఖుర్ఆన్ పారాయణం ఎక్కువగా చేయాలి.

హజ్రత్ ఆయిషా (రజి) దైవప్రవక్త (స)ను "ప్రవక్తా! లైలతుల్ ఖద్ర్ ను గనుక నేను పొందితే అందులో ఏంచేయాలి?" అన్ని ప్రశ్నించగా దానికి ముహమ్మద్ (స)ఈ దుఆ చేయమని ఉపదేశించారు: "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాపు అన్ని". (ఓ అల్లాహ్ ! నిశ్చయంగా నీవే క్షమించేవాడవు. క్షమించడాన్ని నీవు ఎంతో ఇష్టపడతావు కనుక నన్ను కూడా క్షమించు.)